ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 9 మార్చి 2025





స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, విప్ తదితరులు

మహిళల సంక్షేమానికి పెద్దపీట

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థినులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

బెలగాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. శనివారం పార్వతీపురంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సర్కారు పనిచేస్తుందని, ఇందు కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.4,332 కోట్లు కేటాయించిందని తెలిపారు. పండగ వాతావరణంలో మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంద న్నారు. మహిళలు తలచుకుంటే సాధించ లేనిదంటూ ఏమీ లేదన్నారు. నేటి సమాజంలో ఎంతోమంది స్త్రీలు పారిశ్రామిక, ఆర్థిక, విద్యా వేత్తలుగా ఎదుగుతు న్నారన్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తుండడం శుభపరిణామమని వెల్లడించారు. మహిళల సేవలు అనిర్వచనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ జిల్లాకు చెందిన వారిలో ఒకరు ప్రభుత్వ విప్‌గా, మరొకరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేయడం గొప్ప విషయమన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే సత్తా మహిళలకే ఉంద న్నారు. గతంలో బ్యాంకులు డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు భయపడేవని, నేడు మంజూరుకు ఆసక్తి చూపు తున్నాయని తెలిపారు. ఇది మహిళలు సాధించిన విజయమని చెప్పారు. ప్రతి ఇంటి నుంచి ఒక మహిళ పారిశ్రామికవేత్తగా రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. బాల్య వివాహాల రహిత జిల్లా కోసం అనిమియా కమిటీలు, ఎస్‌హెచ్‌జీ, స్వచ్ఛంద సంస్థలు పని చేయాలని సూచించారు. మహిళలకు స్పీకర్, మంత్రి పదవులివ్వడమే గాకుండా ఆస్తిలో సమాన హక్కు కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. ప్రతి కుటుంబంలో మహిళల పాత్ర అనితర సాధ్యమని, వారిని గౌరవించుకోవాలని పిలుపు నిచ్చారు. తొలుత వారు వివిధ శాఖల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం పలు రంగాల్లో సేవలందించిన మహిళలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. డ్వాక్రా సంఘాలకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా పలు పాఠశాల విద్యార్థులు డ్యాన్సులు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ, డీఆర్వో హేమలత, గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు పథక సంచాలకులు సుధారాణి, సత్యం నాయుడు, డీఈవో ఎన్.తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి

ఇంకెన్నాళ్లు?

● నత్తనడకన సీతంపేట మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు
● భవనం లోపల పిచ్చిమొక్కలు
● పట్టించుకోని అధికారులు
● మరో తొమ్మిది నెలల గడువు పొడిగింపు?
● పెదవి విరుస్తున్న గిరిజనులు

సీతంపేట రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సీతంపేటలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నిర్మాణం కొలిక్కి రావడం లేదు. ఇప్పటికే భవనం లోపలి భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోగా.. ఆ ప్రాంగణమంతా అధ్వానంగా దర్శనమిస్తోంది. మొత్తంగా గిరిజనులకు స్పెషలిస్ట్ వైద్యుల సేవలు అందేదెప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వం సీతంపేట కేంద్రంగా రూ.49కోట్లతో మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని మంజూరు చేసింది. 2022, మే నెలలో భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏపీఎంఐడీసీ(ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ఆధ్వర్యంలో అప్పట్లో టెండర్లు పిలిచారు. ఈ మేరకు ఎన్‌సీసీ(నాగార్జున కనస్ట్రక్షన్స్) టెండర్లను దక్కించుకొని పనులు ప్రారంభించింది. అయితే నిబంధనల మేరకు మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని 2024, డిసెంబర్ నాటికి పూర్తిచేసి సంబంధిత మెడికల్ విభాగానికి అప్పజెప్పాల్సి ఉంది. కానీ సంబంధిత సంస్థ ఇప్పటి వరకు నిర్మాణం పూర్తిచేయలేదు. ఇంకా 20శాతానికి పైగా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లుల చెల్లించకపోవడం వల్లే పనులు వేగవంతం కాలేదనే ఆరోపణలు ఉన్నాయి. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలల వ్యవధిలోనే సంబంధిత సంస్థకు బిల్లులను చెల్లించింది. అయినప్పటికీ ఆసుపత్రి పనులు మాత్రం ఊపందుకోలేదు. ఇంకా నత్తనడకనే సాగుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా సంబంధిత సంస్థకు చెందిన కాంట్రాక్టర్ ఈ ఏడాది సెప్టెంబరు వరకు గడువు కోరినట్లు తెలుస్తోంది.



ఆసుపత్రి లోపలి భాగంలో పెరిగిన పిచ్చి మొక్కలు

అందుబాటులోకి వస్తే ఎన్నో సేవలు..

సీతంపేట మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే సుమారు 20 రకాల స్పెషలిస్ట్ వైద్యసేవలు గిరిజనులకు అందుబాటులోకి రానున్నాయి. ప్రధానంగా కార్డియాలజీ, గ్యాస్ట్రో, న్యూరో, ఆర్థో, యూరాలజీ, నెఫ్రాలజీ, స్కిన్ తదితర కీలక విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య సేవలు అందనున్నాయి. అంతేకాకుండా 800 మందికి పైగా వైద్య సిబ్బంది వివిధ విభాగాల్లో పనిచేయనున్నారు.ఈ ఆసుపత్రి ద్వారా సీతంపేట, భామిని, కొత్తూరు, హిరమండలం, పాలకొండ, వీరఘట్టం మండలాలతో పాటు ఉమ్మడి జిల్లాల పరిధిలోని సరిహద్దు గ్రామాల ప్రజలు, ఒడిశా వాసులకు అత్యాధునిక వైద్యసేవలు అంద నున్నాయి. ఈ నేపథ్యంలో ఆసుపత్రి నిర్మాణంపై ప్రభుత్వం, ప్రజాప్రతి నిధులు దృష్టి సారించాలని గిరిజనులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఏపీఎంఐడీసీ డీఈ ఏమన్నారంటే...

ఈ ఏడాది సెప్టెంబరు నాటికి సీతంపేట మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పూర్తవుతాయని ఏపీఎంఐడీసీ డీఈ సిమ్మన్న తెలిపారు. కాంట్రాక్టర్‌కు చెందిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున సమయం కోరినట్లు చెప్పారు.

ఇక మన్యానికి ఇద్దరు డీఎంవోలు

● ఐటీడీఏల కేంద్రంగా విధుల నిర్వహణ
● ఆదేశాలు జారీ చేసిన వైద్య ఆరోగ్యశాఖ
● మలేరియా నివారణే లక్ష్యంగా చర్యలు



పార్వతీపురం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ ఇతరత్రా వ్యాధుల నివారణకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా 'మన్యం'కు ఇద్దరు మలేరియా అధికారులను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వుల మేరకు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు డీఎంవోలుగా నియామకమైన మణి, సత్యనారాయణలు డీఎంహెచ్‌వో భాస్కరరావు పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో మలేరియా అధికారిగా ఉన్న వై.మణి ఇప్పటివరకు మన్యం జిల్లా ఇన్‌చార్జిగా అదనపు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఇకపై పార్వతీపురం ఐటీడీఏ మలేరియా అధికారిగా పూర్తిస్థాయిలో పనిచేయనున్నారు. ఇదిలా ఉండగా శ్రీకాకుళం జిల్లా మలేరియా అధికారిగా పనిచేస్తున్న సత్యనారాయణ సీతంపేట ఐటీడీఏ పరిధిలో విధులు నిర్వర్తించనున్నారు. తక్షణమే వారు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటీడీఏల ఇన్‌చార్జి పీవోలు అశుతోష్ శ్రీవాత్సవ, యశ్వంత్‌కుమార్ రెడ్డికి రిపోర్టు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తూ..

గతంలో రెండు ఐటీడీఏల పరిధిలోనూ పూర్తిస్థాయి డీఎంవోలు లేరు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇన్‌చార్జిలతోనే కాలం నెట్టుకొచ్చారు. ఐదేళ్లు ఆయా పోస్టులను భర్తీ చేయలేదు. ఈ క్రమంలో పర్యవేక్షణ కొరవడడంతో గిరిజన ప్రాంతాల్లో ఏటా మలేరియా కేసులు పెరుగు తున్నాయి. ఎంతోమంది మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై సమీక్షించిన వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు జిల్లాకు ఇద్దరు మలేరియా అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం పూర్వ జిల్లాల్లో పనిచేస్తున్న వారు నెలలో 20 రోజులు ఐటీడీఏల పరిధిలోనే విధులు నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా జిల్లాకు ఇద్దరు మలేరియా అధికారులను నియమించడంతో కేసులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని జిల్లావాసులు భావిస్తున్నారు.

పార్వతీపురం డంపింగ్ యార్డులో మంటలు

● అదుపు చేసేందుకు తీవ్ర యత్నం
● రాత్రి 11 గంటల వరకు శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది

8లో

గజరాజుల బీభత్సం

● పంటలు, వ్యవసాయ పరికరాలు ధ్వంసం
● పూజారిగూడలో సంచారం




కొఠియా కొండల్లో సూపర్ స్టార్

● మహేష్‌బాబు, రాజమౌళి చిత్రం షూటింగ్ ● కట్టుదిట్టమైన భద్రత ● ఇతరులకు నో ఎంట్రీ



తోలోమాలి వద్ద చిత్ర యూనిట్ వేసిన సెట్



తోలోమాలి కొండల్లో హీరో మహేష్‌బాబు

సాలూరు రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండల సరిహద్దు ఏవోబీలో ఉన్న కొఠియా కొండల్లోని ఒడిశా భూభాగంలో సూపర్‌స్టార్ మహేష్ బాబు, రాజమౌళి చిత్రం (ఎస్ఎస్ ఎంబీ 29 వర్కింగ్ టైటిల్) షూటింగ్ జరుగుతోంది. గత మూడు రోజులుగా దుదారి పంచాయతీ పరిధి తోలోమాలి కొండల్లో సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఇందుకోసం ఆ ప్రాంతంలో ప్రత్యేకంగా సెట్ వేశారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. రెండో షెడ్యూల్‌ను తోలోమాలి, కొఠియా పంచాయతీలోని దేవ్‌మాలి (తూర్పు కనుమల్లో ఎత్తయిన ప్రాంతం), కోరాపుట్ జిల్లాలోని నందపూర్ తదితర ప్రాంతాల్లో, మల్కన్‌గిరి జిల్లా మాచ్‌ఖండ్‌లో షూటింగ్ జరప నున్నారు. ఇప్పటికే తోలోమాలిలో వేసిన సెట్స్‌లో హీరో మహేష్‌బాబు, సలార్ ఫేం నటుడు పృథ్వీరాజ్ తదితరులపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. తోలోమాలి, దేవ్‌మాలిలో వాతావరణం చల్లగా ఉండడంతో పాటు ప్రకృతి అందాలను హీరోతో పాటు యూనిట్ సభ్యులు ఆస్వాదిస్తున్నారు. కోరాపుట్, మల్కనగిరి జిల్లాల్లో ఈ నెల 29 వరకు షూటింగ్ చేయనున్నారు.

మూడంచెల భద్రత

తోలోమాలి ప్రాంతంలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్లటూన్ ఒడిశా పోలీసులు, చిత్ర యూనిట్ బౌన్సర్లు భద్రత విధులు నిర్వహిస్తున్నారు. మీడియాతో పాటు ఎవరికీ ప్రవేశం కల్పించడం లేదు. చిత్రీకరణ జరుగుతున్న దాదాపు రెండు కిలోమీటర్ల ముందు పర్యాటకులు, షూటింగ్ చూడడానికి వచ్చే వారిని నిలిపివేస్తున్నారు.

రాజీయే రాజమార్గం

● రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు
● లోక్ అదాలత్‌లో 423 కేసులు పరిష్కారం

బెలగాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని.. కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలని రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు సముదాయంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ మార్గంలో 423 కేసులు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. వివాదాలు మొదలైతే జీవితాంతం కొనసాగుతాయని, వాటిని త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీ చేసుకోవడం వల్ల డబ్బు, సమయం ఆదా అవుతాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో మోటారు వెహికల్ కేసులు 6, దావాలు 22, ప్రోనోట్ 7, టైటిల్ దావాలు 5, ఫైనల్ డిక్రీ పిటిషన్ 1, ఎక్సైజ్ కేసులు 45, కుటుంబ తగాదా కేసులు 4, చెక్ బౌన్స్ 5, ఎస్‌టీసీ కేసులు 4, క్రిమినల్ కాంపౌండ్ బుల్ 53 కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య జోస్పిన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌.శ్రీనివాసరావు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న రెండో అదనపు న్యాయాధికారి

నాలుగు మండలాలకు ఒకటే..

● జిల్లాకేంద్రంలో ఉన్న అగ్నిమాపక శకటమే దిక్కు ● రైల్వే గేట్లు దాటి ప్రమాద స్థలానికి చేరేలోపు భారీ నష్టం
● ఇప్పటికే అగ్నికి ఆహుతవుతున్న తోటలు ● ఆందోళనలో అన్నదాతలు



కొమరాడ, మార్చి8(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం పూర్తిగా రాకముందే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం వేళల్లో గరిష్ఠస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ సీజన్‌లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ. అప్రమత్తంగా లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. కాగా కొమరాడలో అగ్నిమాపక కేంద్రం లేదు. దీంతో సకాలంలో ప్రమాద స్థలానికి ఫైర్ ఇంజన్లు రావడం లేదు. పార్వతీపురం జిల్లా కేంద్రం నుంచి మూడు రైల్వే క్రాసింగ్ గేట్లు దాటి కొమరాడ మండలంలోకి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి పూర్తిస్థాయిలో నష్టపోతున్నట్లు బాధితులు వాపోతున్నారు. వాస్తవంగా సీతానగరం, పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాలకు ఒకటే ఫైరింజన్ ఉంది. పార్వతీపురంలో ఉన్న అగ్నిమాపక శకటం ఆయా ప్రాంతాలకు వెళ్లే సరికి బాధితులకు భారీగా నష్టం జరుగుతుంది. దీనిపై ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించాలని ఆయా మండలాలవాసులు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సూర్య ప్రతాపానికి పచ్చిక బైర్లు సైతం ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పచ్చని పంటలు అగ్నికి ఆహుతవుతున్నాయి. సకాలంలో ఫైర్ ఇంజన్లు ప్రమాద స్థలానికి చేరుకోలేకపోవడంతో మంటలు వేగంగా వ్యాపించి జీడి మామిడి, పామాయిల్ వంటి చెట్లు కాలి బూడిదవుతున్నాయి. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల కాలంలో అగ్ని ప్రమాదాలు జరిగి పంటలు, డ్రిప్ పరికరాలు బూడిదైన సందర్భాలున్నాయి. కొమరాడ మండలం కొత్తవలస గ్రామంలో

(మిగతా 8వ పేజీలో...)

పర్యవేక్షణ లేదు.. హెచ్చరిక బోర్డులు లేవు



కోటవాని చెరువు గెడ్డ వద్ద మలుపు

●తరచూ ప్రమాదాలు ●ఇదీ కోటవాని చెరువు రోడ్డు మలుపులో పరిస్థితి

లక్కవరపుకోట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి కల్లేపల్లి-శేగ వెళ్లే మార్గంలో కోటవాని చెరువు వద్ద ఉన్న రోడ్డు మలుపు వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటుచేయలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంపై పర్యవేక్షించడం లేదని వాహనచోదకులువాపోతున్నారు. దీంతో ఇక్కడ దగ్గరకు వచ్చే వరకూ ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.నిత్యంకంపెనీకి చెందిన కార్మికులు, ప్రయాణికులతో ఈ మార్గం రద్దీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని కోరుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మలుపు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు వాహనచోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి సిద్ధం

●ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న పోతంపేట సర్పంచ్ నాయుడు

లక్కవరపుకోట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపరంగా నిర్ణయాలు తీసుకోవాల్సినవి ఆలస్యమైనా చిన్న చిన్న సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి హామీఇచ్చారు. శనివారం లక్కవరపుకోటలో ప్రజాదర్బార్‌లో భాగంగా నియోజకవర్గంలో ఐదు మండలాల ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. అక్కడిక్కడే పరిష్కారమయ్యే సమస్యలపై అధికారులతో మాట్లాడారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, విద్యుత్ సమస్యలు, ఆరోగ్య, మంచినీటి, పాఠశాలల్లో సీట్లు, ఆలయాలు అభివృద్ధి తదితర అంశాలపై ఎక్కువ వినతులు వచ్చినట్లు తెలిపారు.

ఐదు సబ్‌స్టేషన్ల మంజూరు

● రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



ఇంజినీర్లతో మాట్లాడుతున్న మురళీమోహన్

రాజాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజాం నియోజకవర్గానికి ఐదు సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శనివారం సబ్‌స్టేషన్లు ఏర్పాటు విషయంలో ఏపీఈపీడీసీఎల్ విజయనగరం రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.సురేష్‌బాబు, డిప్యూటీ ఈఈ ఫణీంద్రకుమార్ వివరాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ ఇప్పటికేనియోజకవర్గంలో 132/33కేవీ తొమ్మిది సబ్‌స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. అదనంగా మం జూరైన ఐదు సబ్‌స్టేషన్లకు త్వరలో స్థల పరిశీలనకు కృషి చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అధికారులను కోరా రు. కార్యక్రమంలో సుమల మన్మథరావు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, గురవాన నారాయణరావు, నాగళ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మక్కువ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాయకపాడుకు చెందినే ఓ వ్యక్తి చికిత్సపొందుతూ శనవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పాయకపాడుకు చెందిన సామంతుల స్వామి నాయుడు(29)ఈనెల ఆరోతేదీ ఉదయం ఇంటి వద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి మక్కువలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం మృతిచెందాడు. కొద్దిరోజులుగా ఖాళీగా ఉంటున్నావని మామ మందలించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగాడు. మృతుడికి వివాహమై ఏడాది అయింది. భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

గంగచోళ్లపెంటలో వరి గడ్డి దగ్ధం

గజపతినగరం, మార్చి8:(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగచోళ్లపెంటలో వరిగడ్డి శనివారం దగ్ధమయ్యింది. అగ్నిమాపకకేంద్ర అధికారి రవిప్రసాద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చినబంగారునాయుడు కల్లంలో వరి కుప్పలు నూర్చారు. తర్వాత గడ్డిని ట్రాక్టర్‌లోకి ఎక్కించారు. ఆ సమయంలో కల్లంలో గల కూలీలు చుట్టకాల్చి పారివేయడంతో గడ్డికి మంటలు రాజుకొని కాలిబూడిదయ్యింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్ని మాపక సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిఉండొచ్చని అధికారుల ప్రాథమిక అంచనావేశారు.

సైకిల్‌ట్యూబ్ వాల్‌పిన్ మింగిన బాలుడు

● తొలగించిన వైద్యుడు ● ప్రాణాపాయం నుంచి బయటపడినవైనం

రాజాం రూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం మండలంలోగల గెడ్డకంచరాంలో ఏడాది వయస్సుగల దుర్గాప్రసాద్ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో సైకిల్ ట్యూబ్ వాల్‌పిన్ శనివారం మింగేశాడు. దీంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న బాలుడిని గుర్తించిన తల్లిదండ్రులు హుటాహుటిన రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఎండోస్కోపీద్వారా పరిశీలించి, అన్నవాహికలో పిన్ చిక్కుకున్నట్లు వైద్యుడు గుర్తించారు. దీంతో మింగేసిన వాల్‌పిన్‌ను సురక్షితంగా తొలగించడంతో దుర్గాప్రసాద్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

ముగ్గురు పరిపాలన కార్యదర్శుల సస్పెన్షన్

విజయనగరం రింగు రోడ్డు, మార్చి8 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగర పాలక సంస్థలో వసూళ్లు చేసిన పన్నులు సకాలంలో జమచేయకపోవడంతో ముగ్గురు పరిపాలన కార్యదర్శులను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ పి.నల్లనయ్య శనివారం ఉత్తర్వులు జారీచేశారు.వసూళ్లు చేస్తున్న పన్నులు సకాలంలో జమకావడంపై తనిఖీచేయాలని అకౌంట్స్ అధికారులకు ఆదేశించారు. 48వ డివిజన్ పరిధిలో గల గాజులురేగ-1కు చెందిన 57వ సచివాలయం పరిపాలనకార్యదర్శి కె.సూర్యనారాయణ వసూళ్లుచేసిన రూ 1,62, 270, 41వడివిజన్ పరిపాలనకార్యదర్శి డి.రామకృష్ణ, రూ.37,380,49 డివిజన్‌కు చెందిన గాజులరేగ-3 సచివాలయానికి చెందిన ఏనుగుతల ప్రవీణ్ కుమార్ వసూళ్లుచేసిన రూ 26,38,238 జమచేయకపోవవడంతో సస్పెన్షన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఆయా నిధులను వారి చేత శనివారం జమ చేయించినట్లు తెలిపారు. వారిని సస్పెన్షన్ చేయడమే కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

లోక్‌అదాలత్‌తోనే సత్వర న్యాయం



మాట్లాడుతున్న శారదాంబ

రాజాం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):లోక్‌అదాలత్ ద్వారానే సత్వర న్యాయం సాధ్యమని సీనియర్ న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు కె.శారదాంబ తెలిపారు. శనివారం రాజాం కోర్టు సముదాయప్రాంగణంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ఇరుపార్టీల పరస్పర ఆమోదంతో రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులు అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని న్యాయాధికారులు కోరారు. శనివారం జిల్లాలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు.

●గజపతినగరం, మార్చి8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మున్సిప్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 321 కేసులు పరిష్కరించినట్లు న్యాయాధికారి బి.కనకలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రమేష్ రాజు,రెడ్డి శ్రీనివాసరావు, కల్లిశెట్టి రామునాయుడు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట, మార్చి 8(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట కోర్టు ప్రాంగణంలో న్యాయాధికారి సబ్బవరపు వాణి అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్‌లో 216 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు జి.సూరిదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, డబ్ల్యూఎస్ శర్మ పాల్గొన్నారు.

● కొత్తవలస, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా రాజీకి వీలైన కేసులను లోక్‌అదాలత్‌ల ద్వారా రాజీ చేసుకుని పరిష్కరించుకోవాలని కొత్తవలస కోర్టు న్యాయాధికారి ఎస్. విజయచందర్ తెలిపారు. కొత్తవలస కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహించారు.

●రాజాంరూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజాం కోర్టు సముదాయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 148 కేసులు పరిష్కరించామని సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ తెలిపారు. జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజతో కలిసి రెండు బెంచ్‌లు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రాజాం బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షులు జయదేవ్‌తోపాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమాంబ జాతర

గజపతినగరం,మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపల్లిలో ఆదివారం నుంచి మూడు రోజులపాటు ఎల్లమాంబ జాతర జరగనుంది. ఏటా శివరాత్రి వెళ్లిన తర్వాతగ్రామంలో ఎల్లమాంబ తల్లి సిరిమానోత్సవం నిర్వహిస్తారు. శ్రీకాకుళం జిల్లాలోని ఒంబరిల్లిలో వెలిసిన ఎల్లమ్మతల్లి తర్వాత జామిగ్రామానికి తరలివెళ్లిన అనంతరం మరుపల్లిలో గల గెద్దవారి కుటుంబంలోని వెంకటనాయుడు, అప్పలనాయుడు ఇంట కొలువుదీరింది. జాతరకు రాష్ట్రంలోని నలుమూలలు,ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులను తీర్చుకుంటారు. జాతర పురష్కరించుకొని ఆదివారం వీర జోగి చేపడతారు.సోమవారం గ్రామంలో వెలసిన ఎల్లమాంబ,పరశరాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సాయంత్రం సిరిమానోత్సం నిర్వహిస్తారు. తరతరాలుగా రుద్రాక్షుల, కర్నకోట వంశీయులు పూజారులుగా వ్యవహరించి సిరిమానును అవరోధిస్తారు. సిరిమానోత్సవానికి దత్తిరాజేరు మండలంలోని పెదకాద గ్రామానికి చెందిన చల్ల సన్యాసిరావు రైతుకల్లం నుంచి తీసుకువచ్చిన సిరిమానును అవరోధించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రేపు వేంకటేశ్వర కల్యాణం

కొత్తవలస, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస కుమ్మరవీధిలో గల అలివేలు మంగసమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వార్షిక లీలా కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతర విష్ణు సహస్రనామ పారాయణం, సాయంత్రం స్వామివారి తిరువీధి జరుగుతాయని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

శృంగవరపుకోట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పోలీస్ స్టేషన్ సమీపంతోపాటు సీతంపేటలో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు,టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి పాల్గొన్నారు.

సిమెంట్ వితరణ

చీపురుపల్లి/గుర్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని తెట్టంగిలో దుర్గాదేవి ఆలయ నిర్మాణం కోసం టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ముల్లు రమణ 50 బస్తాల సిమెంట్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు,ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగులపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

పాలవలసలో పరామర్శ

గుర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలవలసలో ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు మాతృమూర్తి కనకమ్మ మృతిచెందడంతో శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆయనవెంట జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ చంద్రశేఖర్, ఎంఎల్‌సీ సురేష్‌బాబు, పులిరాజు ఉన్నారు.

వారంరోజుల్లో కమిటీలు చేయండి

విజయనగరంరూరల్,మార్చి8(ఆంధ్రజ్యోతి):ఉపాధి,వైద్యం, వ్యవసాయశాఖ, రెవెన్యూ తదితర శాఖలకు సంబంధించి నిబంధనలు, చట్ట ప్రకారం వేయాల్సిన కమిటీలు వారం రోజుల్లో అధికారులు పూర్తిచేయాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు ఆదేశించారు.శనివారం విజయనగరం మండల పరిషత్‌సమావేశం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా మాట్లాడుతూ ఎంపీపీ చైర్మన్‌గా, ఎంపీడీవో కన్వీనరుగా, ఎంపీటీసీలు కమిటీలో సభ్యులుగాఉంటారని చెప్పారు.అనంతరం పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గంటా వెంకటరావు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

గజపతినగరం, మార్చి8:(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా మంత్రి శాసనసభలో బెల్టుషాపులే లేవని చెప్పడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. శనివారం గజపతినగరంలో విలేకరులతో మాట్లాడుతూ విజయనగరంలో ఈనెల 12న చేపట్టే యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రైవేట్ ఫిట్‌నెస్ కేంద్రం వద్దు

●విజయనగరంలో ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధుల నిరసన



విజయనగరం దాసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

విజయనగరం దాసన్నపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గుర్ల మండలంలోని అచ్చుతాపురంలో ప్రైవేటు ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి వేలాది మంది కార్మికుల పొట్ట కొట్టే చర్యలను వెంటనే నిలిపివేయాలని విజయదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు ఎస్.అప్పలరాజుల రెడ్డి, రెడ్డి నారాయణరావు కోరారు.ఈమేరకు సోమావరం చేపట్టనున్న చలో అచ్యుతాపురం కార్యక్రమం జయప్రదం పిలుపునిచ్చారు.శనివారం విజయనగరంలోని ఆర్టీసీకాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ వరకూ ఆటో కార్మికులతో నిరసనకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్లల్లో చలానా 860 రూపాయలుఉంటే, 3,300 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రైవేటు ఫిట్‌నెస్ సెంటర్లను ఎత్తివేయకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఫిట్‌నెస్ కేంద్రం ప్రభుత్వమే నిర్వహించాలి

డెంకాడ, మార్చి 8(ఆంధ్రజ్యోతి):గరివిడి మండలంలోని అచ్చుతాపురంలో ఏర్పాటు చేసిన వాహనాల ఫిట్‌నెస్ కేంద్రం ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ కోరారు. ఈమేరకు శనివారం మండలంలోని నాతవలస ఆటోస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలోపోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ రవాణాకార్మికులపై భారంవేసి వారి కుటుంబాలను రోడ్డు పాలు చేసేందుకు ప్రభుత్వంచేస్తున్న కుట్రలో భాగంగా ఓ సంస్థకు వాహనాలు ఫిట్‌నెస్ కాంట్రాక్ట్‌ను కట్టబెట్టిందని ఆరోపించారు. ఫిట్‌నెస్‌కేంద్రాన్ని ప్రభుత్వమేనిర్వహించాలని కోరారు.ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్‌వద్ద జరిగే ధర్నాజయప్రదంచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకులు రమణగోవింద, రాజశేఖర్ శ్రీను పాల్గొన్నారు.

12న 'చలో ఢిల్లీ'

విజయనగరం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని దశలవారీ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 12న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీసీ సంఘ మహిళావిభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శశిభార్గవి చెప్పారు. శనివారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడితెచ్చేందుకు బీసీలంతా ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. అనంతరం చలోఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.సమావేశంలో బీసీ సంఘం జిల్లా నాయకుడు నడిపేన శ్రీనివాసరావు, బీసీ సంఘ ప్రతినిధులు రవికుమార్, నరేష్‌బాబు, చిట్టిబాబు, బ్రాహ్మం పాల్గొన్నారు.

పిఠాపురం సభను విజయవంతం చేయాలి

గంట్యాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 12న పిఠాపురంలో జరగనున్న సభను విజయవంతం చేయాలని జనసేన నాయకులు కోరారు. శనివారం గంట్యాడలోని జనసేనపార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు.కార్యక్రమంలోని జనసేన మండలాధ్యక్షులు సారాది అప్పలరాజు, పిట్టా బాలు, మామిడి ప్రశాంత్, రాంబాబు,ఎర్రినాయుడు పాల్గొన్నారు.

● రాజాం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాల నుంచి నాయకులు, వీర మహిళలు,కార్యకర్తలు హాజరై పిఠాపురం సభను విజయవంతం చేయాలని జనసేన నాయకుడు యూపీ రాజు కోరారు. ఈమేరకు రాజాంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావం పోస్టర్ నియోజకవర్గం అడ్ హక్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొర్లె గోవిందరావు, రెడ్డి బాలకృష్ణ పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈవోలుగా నియమించాలి

● ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు

విజయనగరం కలెక్టరేట్ మార్చి 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఎంఈవోలను డిప్యూటీ డీఈవోలుగా నియమించాలని విజయనగరం, శ్రీకాకుళం,అనకాపల్లి జిల్లాలు ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు కోరారు.ఈ మేరకు శనివారం విజయనగరంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతగల ఎంఈవోలను సమగ్రశిక్షలో రాష్ట్రస్థాయి సెక్టోరల్ అధికారులుగా నియమించాలని కోరారు. ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షల నిర్వహణలో హెచ్‌ఎంలపై ఒత్తిడితగ్గించాలని కోరారు.రాష్ట్రంలో 510 హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలని కోరారు.కార్యక్రమంలో హెచ్‌ఎం సంఘం విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సన్యాసిరాజు, శ్రీకాకుళం, అనకాపల్లి నాయకులు దాలినాయుడు, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేయడం తగదు

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు



ధర్నా చేస్తున్న మహిళా కార్మికులు

చీపురుపల్లి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కర్లాంలోని వెంకటరామ పౌల్ట్రీస్‌లో పనిచేస్తున్న 25మంది మహిళాకార్మికులను యాజమాన్యం అన్యాయంగా ఛత్తీస్‌గఢ్ బదిలీ చేయడం తగదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు పేర్కొన్నారు. మహిళా దినోత్సవం రోజున మహిళా కార్మికులకు మరిచిపోలేని బహుమతి ఇచ్చిందని తెలిపారు. ఈ మేరకు కోళ్ల పరిశ్రమ వద్ద మహిళా కార్మికులు నిరసన తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకుని వెళ్లినా ఫలితంలేదని తెలిపారు. సమస్యయ పరిష్కారమయ్యే వరకూ ధర్నా కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకుడు ఇప్పిలి గురునాయుడు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

జూట్ మిల్లు లాకౌట్ ఎత్తివేతకు అంగీకారం

కొత్తవలస, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి పంచాయతీ పరిధిలోని సీతంపేటలో గల ఉమా జూట్ మిల్లులో పదినెలలుగా ఉన్న లాకౌట్‌ను యాజమాన్యం ఎత్తివేయడానికి అంగీకరించినట్లు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా, కార్మిక సంఘం ప్రతినిధి రాంబాబు తెలిపారు. లాకౌట్‌ను ఎత్తివేయాలని కొద్దినెలలుగా కార్మికులు ఆందోళను చేయడమే కాకుండా పలుసార్లు విశాఖలోని జేసీఎల్ వద్ద చర్చలు జరిపారు. ఈనెల ఏడోతేదీన జరిగిన చర్చల్లో 15న మరో దఫా యాజమాన్యం, కార్మికులు మధ్య చర్చల జరిగిన అనంతరం లాకౌట్‌ను ఎప్పుడు ఎత్తివేస్తారన్న విషయం ప్రకటించనున్నట్లు రాంబాబు తెలిపారు. ప్రస్తుతం యాజమాన్య భాగస్వాములు మధ్య ఒప్పందం కుదిరిందని, ఆ ఒప్పందం ప్రకారం యాజమాన్య భాగస్వామి లాకౌట్ ఎత్తివేసి జూట్‌మిల్లును మళ్లి నడిపించడానికి ముందుకువచ్చినట్లు చెప్పారు. లాకౌట్ ఎత్తి వేసి ఉత్పత్తి ప్రారంభించిన దగ్గర నుంచి కార్మికులు ఉత్పత్తి పెంచడానికి కృషి చేస్తారని తెలిపారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

నెల్లిమర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలో చంద్రబాబునగర్ కాలనీలో ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 60 కోనేరు గట్టును ఆక్రమించి చదును చేస్తున్న స్థలంలో రెవెన్యూ అధికారులు శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ బి.సుదర్శనరావు సిబ్బందికి తొలగించాలని ఆదేశించారు.దీంతో ఆర్ఐ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో వీఆర్వోలు రెడ్డి గోవింద్, వెంకటలక్ష్మి, వీఆర్ఏ సూరిబాబు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

జామి జాతరలో 'దమ్మిడి తీర్థం'



జామిలో దమ్మిడి తీర్థానికి తరలివచ్చిన భక్తులు

జామి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జామి ఎల్లారమ్మజాతర పురస్కరించుకుని మహిళకోసం శనివారం దమ్మిడి తీర్థం నిర్వహించారు. మూడురోజుల జాతర ఉత్సవాల్లో భాగంగా మహిళకోసం పూర్వీకుల నుంచి దమ్మిడి తీర్థం నిర్వహిస్తున్న విషయం విదితమే.జాతర మొదటిరోజుతొలెళ్ల, రెండోరోజు పండగ జరుగుతుంది. పండుగను తిలకించేందుకు లక్షమందికి పైగా ప్రజలు వస్తారని అంచనా. ఈ పండుగకు గ్రామస్థులు బంధువులను ఆహ్వానిస్తారు.ఇంటికి వచ్చిన బంధువుల బాగోగులు చూడడం, వారికి వండిపెట్టడం వంటివాటితో మహిళలు రెండు రోజులు ఈ పనిలో ఉండిపోయి పండుగచూసే అవకాశం కోల్పోతారు. దీన్ని గుర్తించిన పూర్వీకులు జామి పండగలో మహిళలకోసం దమ్మిడి తీర్థం నిర్వహిస్తున్నారు. పండుగ రెండురోజుల ముగిసిన తర్వాత వీరికోసం అమ్మవారి గుడిలో ప్రత్యేక దర్శనాలు ఏర్పాటుచేయిస్తారు. అలాగే మహిళలకు ఇష్టమైన అలంకరణతోపాటు ఇతర సామగ్రి రాష్ట్రం నలుమూలల నుంచి తీసుకొచ్చి గ్రామంలో ప్రత్యేకంగా విక్రయిస్తారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు మహిళలు పిల్లాపాపాలతో సందడిగా అమ్మవారిని దర్శించుకొని తమకోసం ఏర్పాటుచేసిన తీర్థంలో తమకు కావాల్సివి కొనుగోలుచేస్తారు. మహిళల ఆనందం కోసం నిర్వహించే దమ్మిడి దమ్మిడి తీర్థంతో జాతర ముగుస్తుంది.

ఎల్లారమ్మ జాతర ఆదాయం రూ.21 లక్షలు

జామి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జామి ఎల్లారమ్మ జాతర ఆదాయాన్ని శనివారం ఈవో ప్రసాద్ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ, టిక్కెట్లు, ప్రసాదాల ద్వారా రూ.21లక్షల 6వేల 124 లభించిందని తెలిపారు.

కుస్తీలో కొండవెలగాడ విద్యార్థి ప్రతిభ

నెల్లిమర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.మణికంఠ ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు శనివారం డీఈవో మాణిక్యంనాయుడు అభినందించారు. కార్యక్రమంలో పీడీ పతివాడ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పూసపాటిరేగలో రామాలయం ప్రారంభం

పూసపాటిరేగ,మార్చి8(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ ఎస్సీకాలనీలో రామాలయాన్ని శనివారం ప్రారంభించారు. హోమాలు నిర్వహించారు. అన్నసమారాధనకు కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, గోవిందపురం ఉపసర్పంచ్ బాల అప్పలరాజులు రూ.50వేలు రామాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం పాల్గొన్నారు.

కొలతల ప్రామాణికతతో వేతనం గిట్టుబాటు

రేగిడి, మార్చి 8,(ఆంధ్రజ్యోతి): కొలతల ప్రమాణికతతో వేతనం గిట్టుబాటు అవుతుందని ఉపాధి ఏపీవో హరనాథ్ తెలిపారు.అమదాలవలసలో వేతనదారులుతీస్తున్న ఫారంపాండ్లను పరిశీలించారు.ఆయన వెంట ఎఫ్ఏ శ్రీదేవి ఉన్నారు.

తూకంలో మోసాలను నియంత్రించాలి

రేగిడి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ధాన్యం తూకంలో మోసాలను నియంత్రించాలని రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు, నారు జనార్దనరావు, పి.రామినాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ధాన్యంకొనుగోలులో మిల్లర్లకు బ్యాంక్ గ్యారెంటీ లేకపోవటం, ప్రభుత్వం సేకరణ దాదాపు నిలిపివేయడంతో ధాన్యం విక్రయాల్లో దళారులు దోచుకొంటున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

నెల్లిమర్ల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు పరిరక్షించాలని సీపీఎం నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు.ఈమేరకు శనివారం నెల్లిమర్ల నగర పంచాయతీలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములు పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు కె.పద్మాభంతో కలిసి డీటీ రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నగర పంచాయతీలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు.నగర పంచాయతీలో 1400 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ప్రభుత్వం ఇచ్చినా ఇంతవరకు వారికి స్థలం చూపించకుండా అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలకడం భావ్యం కాదన్నారు.

నాలుగు మండలాలకు ఒకటే..

(5వ పేజీ తరువాయి)

శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సుమారు ఆరు ఎకరాల్లో జీడి మామిడి చెట్లు కాలి బూడిదయ్యాయి. దీంతో గిరిజన రైతులకు సుమారు రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. తోటల పరిసర ప్రాంతాల్లో గడ్డి ఎండిపోయి ఉండడంతో బాటసారులు, ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల బలిజిపేట మండలం మిర్తివలసలోనూ 1,839 టేకు, జీడిమామిడి చెట్లు దగ్ధమయ్యాయి.

మానవ తప్పిదంతోనే...

మానవ తప్పిదంతోనే అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్ని ప్రమాదం వల్ల పండ్ల తోటలు కాలిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇందుకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించరు. రైతులు వారి పొలాల చుట్టూ ట్రెంచ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. చెట్లు మధ్య ఎండు గడ్డి, ఆకులు లేకుండా చూసుకుంటే నష్టం తీవ్రతను తగ్గించుకోవచ్చు.

- క్రాంతికుమార్, ఉద్యాన శాఖ అధికారి, పార్వతీపురం

డంపింగ్ యార్డులో మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పార్వతీపురంటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర శివారుల్లో గల డంపింగ్ యార్డులో శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. మున్సిపల్ అధికారులు, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. రాత్రి 11 గంటల వరకు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఎప్పటికప్పుడే ఇలా మంటలు రావడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జీవ ప్రాజెక్టు పరిశీలన

గుమ్మలక్ష్మీపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాబార్డు సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో చేపడుతున్న జీవ ప్రాజెక్టులోని కార్యక్రమాలు అమలు తీరును భారత జాతీయ నైపుణ్యాభివృద్ధి ఫౌండేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తన బృందంతో శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా తన బృంద సభ్యులు మురుగేశన్, వీరభద్రారెడ్డితో కలిసి ఆయన గొరడ గ్రామంలో పలు క్షేత్రాలను పరిశీలించారు. మార్కెట్ పరిస్థితులు, ఆదాయ, వ్యయాలు దిగుబడులు తదితరమైనవి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవా ప్రాజెక్టు మానటరింగ్ అధ్యక్షుడు పి.జమ్మయ్య, కార్యదర్శి కె.చిరంజీవి, ఎఫ్‌పీసీ సీఈవో పేకాపు మురళి, జీవ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి. ప్రబోధ్, జట్టు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ

సాలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చలో పిఠాపురం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు శివకృష్ణ కోరారు. ఈ సందర్భంగా శనివారం సాలూరులో పోస్టర్ విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న పిఠాపురం చిత్రాడ వద్ద నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు పెద్దఎత్తున జనసైనికులు, వీర మహిళలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీసాల సతీష్, బోను హేమంత్, సాయి ప్రవల్, యుదిష్టర్, యోగి, మీసాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'ను వినియోగించుకోండి

వీరఘట్టం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యుత్ గృహ వినియోగదారులు ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకానికి పేర్లు నమోదు చేసుకోవాలని విద్యుత్ శాఖ జేఈ కె.అనీల్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో ఇంతవరకు 40 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, రెండు చోట్ల సోలార్ రూఫ్‌సెట్‌లు అమర్చామని చెప్పారు. ప్రభుత్వం లబ్ధిదారులకు రాయితీ అందిస్తుందని, కనుక ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రవాణా చార్జీలను విడుదల చేయాలి

పాలకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం రవాణాకు రైతులు సొంతంగా వాహనాలను ఏర్పాటు చేసుకున్నారని, ఆ చార్జీలను ఇప్పటికీ ఇవ్వలేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రవాణా చార్జీలు నేటికీ చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు రావాల్సిన రవాణా చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, వెంకటరమణ, శేషగిరి, దాలినాయుడు పాల్గొన్నారు.

జీసీసీ ఆధ్వర్యంలో చింతపండు కొనుగోలు



చింతపండును కొనుగోలు చేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతేష్ గ్రామంలో గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో శనివారం చింతపండును కొనుగోలు చేశారు. రూ.36 చొప్పున కొనుగోలు చేశారు. ఈసందర్భంగా మేనేజర్ కృష్ణ ప్రసాద్ రైతులతో మాట్లాడుతూ గ్రామాల్లో చింతపండు నిల్వ చేసుకుని తమకు కబురు చేస్తే వచ్చి గిరిజనులు ఇంటి వద్దనే తూకం వేసి కొనుగోలు చేస్తామని తెలిపారు. నాణ్యమైన చింతపండును తమ కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని కోరారు. జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ సాంబశివరావు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గరుగుబిల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈనెల 10 నుంచి నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి.బాల తెలిపారు. శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో వినతులను అందించవచ్చునన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరిష్కార వేదిక నిర్వహిస్తామని చెప్పారు. అలాగే మండల పరిషత్‌కు సంబంధించి సమస్యలపై వినతులను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

బొబ్బిలి రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రైతులకు రాయితీపై 85 యాంత్రీకరణ పనిముట్లు సరఫరా చేయనున్నామని బొబ్బిలి వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ ఆగ్రోస్ ద్వారా 32 స్ప్రేయర్లు, 16 తైవాన్ స్ప్రేయర్లు, 37 ట్రాక్టర్ పనిముట్లు (దుక్కి. సెట్లు, నాగలి, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్లు) అదేవిధంగా పీవీసీ పైపులు, స్ప్రింకర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంతవరకూ పనిముట్లు లబ్ధి పొందని ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులు, చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి ఈ నెలాఖరు లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

- అన్ని రంగాల్లో రాణించాలని వక్తల పిలుపు
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- వివిధ శాఖల్లో రాణిస్తున్న మహిళలకు సత్కారం

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సన్మానించారు. విజయనగరంలో ఎస్పీ వకుల్ జిందాల్, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అలాగే టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, పురుషులతో సమానంగా పోటీ పడాలని పిలుపునిచ్చారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం: ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ వకుల్ జిందాల్



రాజాం: మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు



గుమ్మలక్ష్మీపురం: మహిళలను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



బొబ్బిలి: జనసేన పార్టీ కార్యాలయంలో మహిళలను సత్కరించిన దృశ్యం



నెల్లిమర్ల: టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వనజాక్షిని సత్కరిస్తున్న దృశ్యం



బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డిని సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు



మెంటాడ: మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదా దేవి



రాజాం రూరల్: మహిళలను సత్కరిస్తున్న డీఎస్పీ రాఘవులు, సీఐ ఉపేంద్రరావు



పాలకొండ: రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రాంబాబు



పార్వతీపురంటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు



గజపతినగరం: మాజీ మంత్రి పడాల అరుణ ఆధ్వర్యంలో..



పాలకొండలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూదేవి ఆధ్వర్యంలో..



బెలగాం: జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

గజరాజుల బీభత్సం



ధ్వంసమైన డ్రిప్ పరికరాలు

కొమరాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాగావళి నది ఆవల వైపు ఉన్న పూజారిగూడ సమీపంలో పంటలను, వ్యవసాయ పరికరాలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. శుక్రవారం రాత్రి, శనివారం ఏనుగుల గుంపు పంటపై పడి నాశనం చేశాయి. పామాయిల్ మొక్కలను పీకివేశాయని, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ధ్వంసం చేశాయని రైతు దత్తి రామ్మూర్తినాయుడు లబోదిబోమంటున్నారు. తక్షణమే ఏనుగులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని ఆయన కోరారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్

గుమ్మలక్ష్మీపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొరడగూడకు చెందిన ప్రజలు తమ గ్రామానికి సీసీ రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే స్పందించి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పాలకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి, ఐదు, ఆరు వార్డు పరిధిలో చేపట్టిన డ్రైనేజీ పనులను నగర పంచాయతీ కమిషనర్ జయరాం శనివారం పరిశీలించారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుమీదకు మురుగునీరు ప్రవహిస్తుందని గుర్తించి, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టామని కమిషనర్ తెలిపారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, ఐదో వార్డు కౌన్సిలర్ యలమల మన్మథరావు, ఆరో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బాబ్జీనాయుడు ఉన్నారు.

వైభవంగా సిర్లిపోతన్న పూజలు



సిర్లిపోతన్న చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

సాలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెల్లివీధిలో ఉన్న సిర్లి పోతన్న, ఎల్లమ్మలకు శనివారం ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ వద్ద బారులు తీరారు. కోడిగుడ్లు, బియ్యం, పూలు, పండ్లు సమర్పించారు.

వాలీబాల్ విజేత 'మండ'



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో మండ జట్టు విజేతగా నిలిచింది. శనివారం గుమ్మలక్ష్మీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో విజేత జట్టుకు పాలకొండ డీఎస్పీ రాంబాబు ట్రోఫీతో పాటు రూ.10వేలు నగదు అందజేశారు. రన్నర్ రుషినికాలనీ జట్టుకు రూ.5వేలు నగదు, మెమెంటో అందించారు. మూడో స్థానం జేకేపాడు కాలనీ టీంకు జ్ఞాపికను అందించారు. సీఐ హరి, ఎస్ఐశివ ప్రసాద్ పాల్గొన్నారు.

కొండచీపుర్లు కొనుగోలు చేస్తున్నాం

- జీసీసీ డివిజనల్ మేనేజర్ కృష్ణ

భామిని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నాణ్యత గల కొండచీపుర్లు, గిరిజనులు పండించే ఇతర అటవీ ఉత్పత్తులను సంతలో కొనుగోలు చేస్తున్నామని సీతంపేట జీసీసీ డివిజనల్ మేనేజర్ డి.కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'ధర లేదు.. కొనేవారు లేరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సీతంపేట జీసీసీ సొసైటీ పరిధిలో 9 వారపు సంతలు నిర్వహించి సీజనల్ వారీగా కొండచీపుర్లు, నరమామిడి చెక్కలు, చింతపండు, చింతపిక్కలు, ఇందుగ పిక్కలు, ముసిడి పిక్కలు తదితర అటవీ ఉత్పత్తులు ఏడాదికి రూ.13.95 లక్షలు విలువ గల వస్తువులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. భామిని జీసీసీ సేల్‌మేన్ పి.విశ్వనాథానికి సంతలో కొనుగోలు విషయం తెలియక అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు. చీపుర్లు పచ్చిగా, లేతగా ఉండి నారతో కట్టడం వల్ల దీర్ఘకాలం నిల్వ ఉంచినప్పుడు నాణ్యత కోల్పోతాయని చెప్పారు. బాగా ఎండపెట్టి నారతో కట్టి సంతలకు తేవాల్సిందిగా గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గిరిజనులు పండిస్తున్న అటవీ ఉత్పత్తులను కార్పొరేషన్ హెడ్ ఆఫీస్(విశాఖపట్నం) నిర్దేశించిన ధరలతో పూర్తి స్థాయిలో జీసీసీ డివిజనల్ మేనేజర్ పర్యవేక్షణలో కొనుగోలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఉపాధి పనుల్లో దళితులకు న్యాయం చేయండి

జియ్యమ్మవలస, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, దీనిపై అధికారులు దృష్టి సారించి న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 17వ తేదీ వరకు ప్రజా సమస్యలపై అధ్యయనం సందర్భంగా జియ్యమ్మవలస మండల కేంద్రంలో దళితవాడను ఆయన శనివారం సందర్శించారు. ఈసందర్భంగా దళితులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత రెండు వారాల నుంచి దళితులకు ఉపాధి పనులు కల్పించడం లేదని, పొలాల్లో పారంపాండ్ నిర్మాణం చేపట్టాలని చెబుతుంటే రైతులు దానికి అంగీకరించడం లేదన్నారు. అలాగే దళితవాడలో మంచి నీటి సౌకర్యం లేదని చెప్పారు. దళితుల శ్మశాన వాటికకు రెండెకరాల భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.సీతారాం, బి.మోహనరావు, దళితులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలి



ర్యాలీ చేస్తున్న మహిళలు

బెలగాం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.కృష్ణవేణి పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో ఎన్జీహోంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఎన్జీఓ హోం వరకు మహిళలతో ర్యాలీ చేశారు. ఈసందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ నాయకులు ప్రమీలారాణి, రైతు కూలీ సంఘం నాయకులు డి.వర్మ, శ్రీను నాయుడు, మహిళా ఉపాధ్యాయులు లలితమ్మ, స్త్రీ విముక్తి సంఘటన నాయకులు జయసుధ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి అభివృద్ధికి కృషి

గరుగుబిల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం అని నాబర్డ్ జిల్లా మేనేజర్ దినేష్‌కుమార్, చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు అన్నారు. శనివారం తోటపల్లి దేవస్థానం ఆవరణలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం అభివృద్ధికి సుమారు 40 మంది సభ్యులను చేర్పించి రూ.15లక్షలు విరాళాలు సేకరించిన భోగి అరుణ, లక్ష్మణమూర్తి దంపతులను అభినందించారు. అలాగే జ్ఞానజ్యోతి ఆధ్యాత్మిక గ్రంథాలయానికి రూ.40వేలు విలువ గల ర్యాక్‌లను తంగుడు గణేష్, భోగి లక్ష్మణమూర్తిలు అందించారు. దేవస్థానం అభివృద్ధి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు, ఈవో వీవీ సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, సేవా ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

పాలకొండ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కోటదుర్గమ్మ అమ్మవారి ఆలయం వరకు ర్యాలీ చేశారు. ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎన్.హిమప్రభ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బి.అమరవేణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్, సీఐటీయూ నాయకుడు తిరుపతిరావు మాట్లాడారు. మహిళల రక్షణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి వేగవంతంగా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో వివిధ మహిళా సంఘాల నాయకులు పార్వతి, సంతోషి, పద్మావతి, జెస్సీబాయి, శారద, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేస్తున్న మహిళలు